క్లుప్తంగా

చిన్నారెడ్డికి సన్మానం

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా నియమితులైన చిన్నారెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాములుయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారెడ్డిని హైదారాబాదులో శాలువతో సన్మానించారు.

గోపాల్‌పేట: చిన్నారెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్ ఆదివారం కలిసి శాలువాతో సన్మానించారు. ఆయనతో పాటు రాజేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

తాగునీటి ఎద్దడి తీర్చండి

చిన్నంబావి: మండలంలోని పెద్దమారులో తీవ్రంగా తాగునీటి ఎద్దడి ఉందని మాజీ ఉప సర్పంచ్ నరేందర్ గౌడ్ ప్రకటనలో తెలిపారు. మూడు నెలలుగా తాగునీటి సమస్య ఏర్పడిన ఇప్పటికి అధికారులు పరిష్కారం చూపడం లేదన్నారు. పది రోజులుగా జిల్లా ఉన్నతాధికారులకు సమస్య విన్నవించినా లాభం లేదని తెలిపారు.

పెద్దమారుర్ రైతు కమిటీ ఎన్నిక

చిన్నంబావి: మండలంలోని పెద్దమారూర్ రైతు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జల్లికురుమయ్య, ప్రధాన కార్యదర్శిగా శివ, కోశాధికారి కృష్ణ, ఉపాధ్యక్షుడుగా అంజి, గౌరవ అధ్యక్షుడిగా అమరేందర్‌రెడ్డి పలువురు సభ్యులు ఉన్నారు.

నిజాయితీగా విధులు నిర్వర్తించాలి

కొత్తకోట: ప్రభుత్వ ఉద్యోగులు ఏ శాఖలో పని చేసిన నిజాయితీగా పనిచేయాలని ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి సూచించారు. కొత్తకోట ఎక్సైజ్ సీఐగా సుదీర్ఘకాలం పాటు పనిచేసిన ఓంకార్ ఇటీవల బదిలీ అయ్యారు. పట్టణంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాచాల యుగంధర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, భీమన్ననాయుడు, నరేందర్‌రెడ్డి, మిషేక్, శ్రీనివాస్‌గౌడ్ పలువురు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు



ఆత్మకూర్: పట్టణంలో ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక గాంధీచౌక్, చెరువుకట్టవద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వాహనదారుల హెల్మెట్, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, తాగి డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

అద్దెభవనంలో స్టాక్‌పాయింట్



పాన్‌గల్: మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ గోదాం అద్దె భవనంలో కొనసాగుతుండటంతో ఇబ్బందులు తప్పడంలేదు. మండల కేంద్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా సొంత భవనం లేదు. స్టాక్ పాయింట్‌కు వచ్చే బియ్యం నిల్వలు ప్రస్తుత అద్దెభవనంలో ఏమాత్రం సరిపోవడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికై న అధికారులు స్పందించి గోదాంకు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే



అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లె శివారులో గల రైతువేదిక వద్ద ఉన్న బోరుమోటర్ ప్రమాదాలకు నెలవుగా మారింది. రైతువేదిక నిర్మాణ సమయంలో తవ్వించిన బోరుబావి ప్రస్తుతం పైకప్పులేకుండా ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నోరుతెరుచుకున్న బోరుబావిని మోటర్ బిగించాలని లేదా వాటిని మూసి ఉంచాలని వ్యవసాయ రైతులు కోరుతున్నారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

- ప్రమాదాల బారిన ప్రజలు, మూగజీవాలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో భయంతో ఆయా కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోనే పరిస్థితి చక్కబెట్టని అధికారులు గ్రామాలవైపు కన్నెత్తి చూడడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పిన్నంచర్ల, బాలకిష్టాపూర్, ఖానాపూర్, గుంటిపల్లి, తిప్పడంపల్లి, జూరాల, మోట్లంపల్లి, మేడేపల్లి, రేచింతల, కత్తేపల్లి, తూంపల్లి, వీరరాఘవపూర్, మూలమళ్లలో ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేసిన 54 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు నేటికీ కంచెను ఏర్పాటు చేయలేకపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రత లేకపోవడం వల్ల మూగజీవాలు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నా అధికారులు నివారించే ప్రయత్నాన్ని చేపట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంచెలు లేని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మూలమళ్లలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

బడ్జెట్ రావడం లేదు

ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెలు లేనికారణంగా ప్రమాదాలు చోటుచేకుంటున్న విషయాన్ని ఉన్నతస్థాయి అధికారులకు గతంలోనే నివేదించాం. నిధులు రాకపోవడంతో గ్రామాల్లో సర్పంచ్‌ల ద్వారా, మున్సిపాలిటీలో పాలకమండలి ద్వారా కంచెలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఇదివరకు ఆత్మకూర్ పట్టణంలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలను ఏర్పాటు చేశారు.

– నర్సింహులు, ఏఈ ట్రాన్స్‌కో, ఆత్మకూర్



కత్తేపల్లిలో..



పిన్నంచర్లలో..



గుంటిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన గేదె(ఫైల్)

రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అమరచింత: వ్యతిరేక విదానాలపై కేంద్రం అవలంభిస్తున్న తీరుపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న, హనుమంతు అన్నారు. ఢిల్లీలో రైతుపై జరిగిన కాల్పులపై పట్టణంలోని అంబేద్కర్‌విగ్రహం వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. రాజధానిలో రైతులు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని తెలిపారు. శాంతియుతంగా తమ నిరసన కార్యక్రమాలను నిర్వహించుకుంటున్న రైతులపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయించడం, డ్రోన్‌ల ద్వార ఫైరింగ్ చేయిస్తుందన్నారు. స్వామినాథన్ కమిషన్ సూచించిన విధంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు, పోలీసు దాడులలో మరణించిన రైతు కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సామేలు, చింతలన్న, మసలమని, భక్తరాజ్, జిలాని, వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.

ముగిసిన గురుకుల ఇంటర్ ప్రవేశ పరీక్ష



బుద్దారం గురుకుల పాఠశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో ఆదివారం గురుకుల ఇంటర్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 356 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 13 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఆరోగ్యం తెలిపారు. ఆర్‌సీఓ విద్యులత సందర్శించి పర్యవేక్షించారు.

ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మండల నాయకులు

ఆత్మకూర్: సంస్థానాదీశులకు కేంద్రంగా వెలుగొందిన ఆత్మకూర్ ప్రస్తుతం అన్ని రకాలుగా వెనుకబడిపోయిందని, రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఆదివారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మక్తల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచందర్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆత్మకూర్‌ను నియోజకవర్గ కేంద్రంగా, రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, 100 పడకల ఆస్పత్రిని నిర్మించాలని, మినీ బస్‌డిపోను, పాలిటెక్నిక్ కళాశాల, గురుకుల పాఠశాలను నిర్మించాలని, కృష్ణానది మీదుగా ఆత్మకూర్ నుంచి గద్వాలకు బ్రిడ్జి నిర్మించాలని, క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలు తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, తులసిరాజ్‌యాదవ్, పరమేష్, శ్రీను, రఘు, అజమ్మత్, గంగ, దస్తగిరి, గడ్డంశ్రీనివాస్, షంషీర్, సాయి రాఘవ తదితరులు ఉన్నారు.

కోతుల బెడద వీడేనా?

పాన్‌గల్: మండల కేంద్రం రోజు, రోజుకు కోతుల బెడద ఎక్కువై ప్రజలపై దాడులు కొనసాగుతున్నాయి. కోతుల గుంపులతో స్థానికులకు కంటి మీద కునుకులేకుండా పోతుంది. వేలాదిగా సంచరిస్తూ చిన్నారులు మొదలుకొని పెద్దలపై దాడులకు దిగుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కోతులను నియంత్రించడం ఖర్చుతో కూడిన అంశం కావడంతో పంచాయతీ పాలకులు ఎలాంటి చర్యలు చేపట్టలేకపోయారు. పంచాయతీ పాలకులు గతంలో ఎన్నికల ముందు కోతులను నివారిస్తామని హామీలు ఇచ్చిన అవి నీటి మూటలుగానే మిగిలిపోయాయి. పంచాయతీల పదవీకాలం కూడా ముగిసింది. వానరాల సంతతి నానాటికి పెరిగిపోతుండటం ఆందోళన కలిగించే విషయం. అటవీ ప్రాంతంలో పండ్ల చెట్లు లేకపోవడంతో అవి గ్రామాల్లోకి చొరబడుతున్నాయి. ఇళ్లు, కిరాణ దుకాణాల్లోకి చొరబడి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇంటి పైకప్పు పెంకుల్నీ పెకిలించి వేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. మరో వైపు గ్రామ సమీపంలోని పంటలను నాశనం చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిలిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాన్‌గల్‌లో ఓ కాలనీలో కోతుల గుంపు

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నచింతకుంట మండలంలోని ఉంద్యాల గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మించిన ఎంబీ హెర్మోన్ చర్చి ప్రహరీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలో కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు. నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం వెంగళాయిపల్లికి చెందిన బాలస్వామి, భాస్కర్ కలిసి శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి పాన్‌గల్ బయలుదేరారు. ఈ క్రమంలో పాన్‌గల్ శివాలయం సమీపంలో వనపర్తి నుంచి కొల్లాపూర్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. బాలస్వామికి రెండు కాళ్లు దెబ్బతినగా, భాస్కర్ తలకు తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ తెలిపారు. తల్లి బక్కమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

కొత్తకోట రూరల్: వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరుకు షేక్ ఇమామ్ హుస్సేన్ బైక్‌పై వెళ్తుండగా కొత్తకోట సమీపంలోకి రాగానే బైక్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో షేక్ ఇమామ్ హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో క్షతగాత్రుడిని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని వద్ద గల రూ.36వేల నగదును, పర్సును, ఐడీ, ఏటీఎం కార్డ్సును డాక్టర్ పరిమళకు అందజేశారు. నిజాయితీ చాటుకున్న 108సిబ్బంది ప్రభాకర్, రాఘవేంద్రలను ఆస్పత్రి సిబ్బంది అభినందించారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి

అడ్డాకుల: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల, శాఖాపూర్, కాటవరం, తిమ్మాయిపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. సీసీరోడ్ల పనులను సకాలంలో నాణ్యవంతంగా పూర్తి చేయించే విధంగా చూడాలని నాయకులను కోరారు. హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని, మరో రెండు హామీలను నెరవేర్చనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని మున్సిపల్ చైర్మన్‌ఆనంద్‌గౌడ్ అన్నారు. సమస్యలపై తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆదివారం ఆయనను బీకేరెడ్డి కాలనీ వాసులు సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, జీహెచ్ఎం మురళీకృష్ణ, శంకర్, పాండు, తిరుపతయ్య, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 11వ వార్డు పరిధిలోని బాలాజీనగర్‌లో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించి స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెయిన్ రోడ్డు నుంచి కాలనీ లోపలి వరకు త్వరలో సీసీరోడ్డు నిర్మిస్తామన్నారు. అంతకుముందు అక్కడి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



బాలాజీనగర్‌లో కాలనీ వాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి

పెబ్బేరు రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో మోదీ చేసిన అభివృద్ధి చూసి ఓటెయ్యాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి పిలుపునిచ్చారు. బీజేపీ విజయ సంకల్పయాత్ర ఆదివారం పట్టణంలోని సుభాష్‌చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌కార్డుతో దేశంలో ఎక్కడైనా రూ.5లక్షల వరకు వైద్యం చేసుకోవచ్చని, కానీ ఇక్కడ ఉన్న ప్రభుత్వం దాన్ని అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించారు. కానీ ఆరు గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రోజే రైతులకు ఎకరాకు రూ.15వేల రైతు సాయం, రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు రైతులకు హామీ ఇచ్చి, ఇంతవరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో నారాయణ, శ్రీవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, గొనివేమారెడ్డి, పెద్ది రాజు, ఆంజనేయులు, నారాయణ నాయకులు పాల్గొన్నారు.



పెబ్బేరులో మాట్లాడుతున్న బంగారు శృతి

పాటల సీడీ ఆవిష్కరణ



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కొత్తకోట రూరల్: మండలంలోని చర్లపల్లికి చెందిన నరేందర్‌గౌడ్ శివుని పాట పాడి సీడీగా తయారు చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువకులు నరేందర్‌గౌడ్‌ను ఆదర్శంగా తీసుకుని, తమకు ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

దీర్ఘకాలిక రోగాలకు హోమియో మందులు

కొత్తకోట: దీర్ఘకాలిక రోగాలకు హోమియో మందులతో ఉపశమనం కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే రావుల రవింద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని శిశుమందిర్ స్కూల్ ఆవరణలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు శిబిరం వద్దకు చేరుకుని వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకున్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హోమియోపతి డాక్టర్ సాయికృష్ణగౌడ్ తెలిపారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న రావుల రవింద్రనాథ్‌రెడ్డి

కేంద్ర విధానాలను వ్యతిరేకించండి



కార్మికులతో మాట్లాడుతున్న రాజు

ఆత్మకూర్: శాంతియుతంగా సమస్యలను పరిష్కరించాలని ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు నిరసన తెలుపుతుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అణగదొక్కేందుకు కుట్రలు పన్నుతుందని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. ఆదివారం మండలంలోని గ్రామాల్లో రైతులు, ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. నరేంద్రమోదీ దేశంలోని కార్మికులను, రైతులను, మధ్యతరగతి కుటుంబాలను అణగదొక్కి అంబానీ, ఆదానీలకు మేలు చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

ఎండుతున్న పల్లె ప్రకృతివనం మొక్కలు



పీజేపీ క్యాంపు సమీపంలో బృహత్ వనంలో మొక్కల పరిస్థితి

అమరచింత: మండలానికో బృహత్ పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేసి మొక్కలను సంరక్షించే చర్యలు తీసుకున్న అధికారులు, ప్రస్తుతం వాటి సంరక్షణను మరిచారు. దీంతో నాటిన పదివేల మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు క్యాంపు సమీపంలో నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన బృహత్ పల్లెప్రకృతి వనంలో పదివేల మొక్కలు నాటి వాటిని సంరక్షించారు. ప్రస్తుతం పంచాయతీకి సంరక్షణ బాధ్యతలు అప్పగించారు. రోజువారి మొక్కలకు నీటిని అందించలేక పోవడంతో అవి ఎండుపుల్లలుగా దర్శనమిస్తున్నాయి. వీటితో పాటు సంపద వనాల పరిస్థితి సైతం అదేవిధంగా తయారైంది.



పీజేపీ ఎడమ కాల్వ సమీపంలో సంపదవనం

ప్రెస్ అకాడమీ చైర్మన్ ఎంపికపై హర్షం

పాన్‌గల్: రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డి ఎంపికపై మండల ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు ఎండీ.నయ్యూం, కాశీనాథ్, రాములుయాదవ్, రాఘవేందర్‌గౌడ్, రాములు రమేష్‌రావు ఆదివారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కొత్త చైర్మన్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆత్మకూర్: ప్రెస్ అకాడమీ చైర్మన్ టీయూడబ్ల్యూజే, ఐజేయూ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డిని ప్రభుత్వం నియమించడంపై జర్నలిస్టులు హర్షం ప్రకటించారు. జర్నలిస్టులకు అన్నిరకాలుగా న్యాయం జరుగుతుందని జిందెశ్రీను, మహ్మద్ రఫీ, విజయ్, ఆంజనేయులు, లూకాస్, తౌకలి శ్రీను, అనిల్, తిరుపతి, గాలిరెడ్డి, వాహిద్, ఆమీర్, ఫకురుద్దీన్ తెలిపారు.